# ఆపదలో ఆడపిల్ల

సమయం రాత్రి ఏడు గంటలే అయినా వర్షం జోరున కురుస్తుండటంతో అది అర్ధరాత్రి సమయంలా వుంది. రోడ్డుమీద మనుషులు తిరగడం లేదు. రిక్షాలు, ఆటోలు ఒకటి అరా అటూ ఇటూ తిరుగుతున్నాయి.

శ్రీలతకు భయంగా వుంది. ఆమె వయస్సు పాతికేళ్ళు. తెల్లగా అందంగా పోతపోసిన బొమ్మలా ఆకర్షణీయంగా వుంటుంది.

శ్రీలత ఆలోచనలు రకరకాలుగా పోతున్నాయి. తను గుంటూరు నుండి తిరుపతికి వెళుతూ స్నేహితురాలిని చూద్దామని ఈ ఊర్లో దిగింది. ఇంటికి వెళితే ఇల్లు లాక్ చేసి వుంది. విచారిస్తే ఆమె స్నేహితురాలు రెండు రోజుల క్రితమే హైదరాబాదు వెళ్ళిపోయిందని తెలిసింది. ఈసురోమంటూ తను బస్టాండుకు వచ్చింది. రావడమే తడవుగా కుండపోతగా వర్షం.

రెండు గంటల నుండి అలాగే కూర్చుని ఉంది. తిరుపతి వైపు వెళ్లే బస్సులు ఒక్కటి కూడా రాలేదు. ఎంక్వైరీలో విచారిస్తే రెండు చోట్ల బ్రిడ్జిలు తెగాయని ఇక తిరుపతికి వెళ్లే బస్సులు రావని, అదీగాక ఈ రాత్రికి ఎటూ బస్సులు వెళ్ళవని చెప్పాడు.

ప్రయాణీకులు చాలామంది తలా ఒకదారిన వెళ్ళిపోయారు. ఇక రైల్వే స్టేషన్‌కు వెళ్దామంటే అది ఇక్కడికి చాలా దూరముంది. ఇంత వర్షంలో రెండేళ్ళ బాబును తీసుకుని అంతదూరం వెళ్ళాలంటే ఆమెకు ధైర్యం చాలడంలేదు. అయినారైళ్లు మాత్రం వెళుతున్నాయని నమ్మకమేమిటి?

ఆమె ఆలోచనలకు అడ్డుకట్ట వేస్తూ బాబు ఏడుస్తూ లేచాడు. బాబు పాలకు ఏడుస్తున్నాడు. సీసాలో పాలు ఇంతకు ముందే బాబుకు పట్టేసింది. ఈ వర్షానికి క్యాంటీన్ కూడా కట్టేశారు. పాలు దొరకవు. ఇక పిల్లవాడ్ని ఆపేదెలా? ఇక్కడ బిడ్డకు పాలివ్వడం తనకు కుదరదు.

దూరంగా కిళ్ళీబంకు దగ్గర నిలబడి వున్న కుర్రాళ్ళు తనవైపు ఆశగా చూస్తున్నారు.

'ఏం మనుషులు? ఆపదలో వున్న ఆడపిల్లంటే అందరికీ అలుసే' అనుకొంది.

ఇంతలో యాభై ఏళ్ళ వయసుతో, గౌరవనీయుడుగా కనిపిస్తున్న ఓ వ్యక్తి శ్రీలతను సమీపించి ఎక్కడికి వెళ్ళాలంటూ పలుకరించాడు.

పిల్లాడిని ఓదారుస్తున్న శ్రీలత ఒక క్షణం సంశయించి విషయమంతా చెప్పింది. అతను చాలా నొచ్చుకున్నాడు.

"అయ్యయ్యో! ఇప్పుడెలా?" అన్నాడు చివరకు. శ్రీలత ఏం మాట్లాడకుండా మౌనంగా వుండిపోయింది.

" అమ్మా! నీకు అభ్యంతరం లేకపోతే నాతోరా! ఈ రాత్రికి మా ఇంట్లో వుండి రేపు ఉదయం పోదువు" అంటూ శ్రీలతకు తనను గురించి తాను పరిచయం చేసుకున్నాడా వ్యక్తి.

తన పేరు కృష్ణప్రసాద్ అనీ, తను కాలేజీ లెక్చరరుగా పని చేస్తున్నానని. ఫ్రెండ్‌ని రిసీవ్ చేసుకోవడానికి వచ్చి బస్సులు రావని తెలియడంతో తిరిగి వెళ్ళిపోతున్నాని చెప్పాడు. క్షణం భయపడి పోయింది శ్రీలత . మనిషి చూస్తే చాలా పెద్దమనిషిలా కనిపిస్తున్నాడు. వయస్సుకు తగ్గ మర్యాద వుంది. అలా అని ముక్కు ముఖం ఎరుగని వాడి వెంట వెళ్ళడమా 'బాబోయ్' అనుకొంది. కానీ అంతలోనే మళ్ళీ ఆలోచించింది. ఆయన మాటలు కాదని తను ఇక్కడ బస్టాండులో బిడ్డకు పాలు లేకుండా ఒంటరిగా రాత్రంగా గడపగలదా? ఆమె మనసు సందిగ్ధాల మధ్య కొట్టుకుపోసాగింది.

"నీకేం భయంలేదమ్మా! తండ్రి లాంటివాడ్ని. ఈచలిలో, వర్షంలో ఇక్కడ వుండలేవు. పసిబిడ్డ ఏడుస్తున్నాడు" అంటూ ఒకటికి రెండు సార్లు చెప్పే సరికి ఆమె మెత్తబడక తప్పలేదు.

ప్యాంటు మోకాళ్ళ పైకి మడిచి గొడుగేసుకుని వెళ్ళి పదినిమిషాల్లో ఆటో మాట్లాడుకొని వచ్చాడు. అతనికి కొద్ది దూరంలో జరిగి కూర్చొంది.

దారిలో ఆటో ఆపి మూసివున్న ఒక కొట్టు తలుపులు తెరిపించి బిస్కట్లు, పాలడబ్బా కొన్నాడు. ఆటో ఊరికి దూరంగా ప్రయాణించి అక్కడక్కడా గెస్టుహౌసుల్లా వున్న బంగళాల్లో ఒక బంగళా ముంది ఆగింది. డ్రైవరు హారను కొట్టాడు.

వరండాలో నడివయసులో వున్న ఒక స్త్రీ ఒళ్ళంతా దుప్పటి కప్పుకొని వచ్చి గేటు తీసింది. ఆటో నేరుగా వెళ్ళి ఇంటి మెట్లదగ్గర ఆగింది.

శ్రీలత అలసి నిద్రపోయిన బాబుని భుజాన పడుకోబెట్టుకుని దిగింది. పనిమనిషి సూట్ కేసు వరండాలో పెట్టింది. ఆటో వాడికి హైర్ చార్జెస్ ఇచ్చేసి పంపేశాడు కృష్ణ ప్రసాద్.

ఇంటి తలుపులు తీసి లైట్లన్నీ వేశాడు. "రామ్మా" అంటూ లోనికి ఆహ్వానించాడు.

భయపడుతూ, భయపడుతూ హాల్లోకి వచ్చింది శ్రీలత. విశాలమయిన ఆహాల్లో రెండు సోఫాలున్నాయి.

ఆయన ఒక సోఫాలో కూర్చుంటూ 'కూర్చో అమ్మా' అన్నాడు.

ఆమె సందేహిస్తూ నిలబడి పోయింది.

అతను చిన్నగా నవ్వి "నీకు ఇక్కడేం భయం లేదు. వసతులు అన్నీ వున్నాయి. స్నానం చేసి, భోజనం చేసి హాయిగా నిద్రపో"

నరసమ్మా అమ్మాయికి ఏం కావాలో అన్నీ చూడు. బీరువాలో అమ్మగారి చీరలున్నాయి. ఇంకా ఏం కావాలో అడుగు" అన్నాడు.

"అయ్యా! చిత్తం" అంది నరసమ్మ.

"అమ్మా నే వెల్తున్నా. నా అన్నపూర్ణ రాత్రంతా నీకు తోడు వుంటుందిలే" అంటూ గోడకు తగిలించిన నిలువెత్తు ఫోటో చూపించాడు. ఆ పటానికి దండ వేలాడుతోంది.

ఆచీకట్లో, కుండపోతగా కురిసే వర్షంలో, ఆ మెరుపుల మధ్య గొడుగు వేసుకుని టార్చి వెలుతురులో బయటికి వెళ్ళిపోయాడు.

నరసమ్మ ఎంతో ఆప్యాయంగా పాలడబ్బా ఓపెన్ చేసి పిల్లవాడికి పాలు కలిపి సీసాలో పోసింది. తరువాత అమ్మగారి చీరెలు, జాకెట్లు ఓ అరడజను తెచ్చి సోఫాలో వుంచింది. మొదట సందేహించినా 'ఈ రాత్రేకదా. వీటిలో నచ్చిన చీర కట్టుకుంటే సరిపోతుంది' అనుకొంటూ అందులోని చిలకాకు పచ్చ రంగు చీర, అదే రంగు జాకెట్టు తీసుకుని బాత్‌రూమ్‌లోకి వెళ్ళింది శ్రీలత.

స్నానంచేసి చీర, జాకెట్టు మార్చుకొని హాల్లోకి వచ్చేసరికి, నరసమ్మ పిల్లవాడికి పాలుపట్టి సోఫాలో సరిగ్గా పడుకోబెట్టింది.

"అమ్మగారి దుస్తులు తమరికి అచ్చుగుద్దినట్లు సరిపోయాయమ్మా! అందంగా మెరిసిపోతున్నారు" మెచ్చుకుంది నరసమ్మ.

సిగ్గుపడిపోయింది శ్రీలత.

"అమ్మా! డైనింగు టేబుల్ మీద అన్నీ సర్దివున్నాయి వెళ్ళి భోంచేసి రండి. బాబు దగ్గర నేనుంటాను" అంది నరసమ్మ.

వేణ్ణీళ్ళతో స్నానం చేసి ఫ్రెష్‌గా తయారయ్యే సరికి ఆకలి దహించుకుపోతూ వుంది. డైనింగ్ రూములోకి వెళ్ళి అవురావురమంటూ భోంచేసింది. అప్పటిదాకా అర్థం కాలేదు కృష్ణ ప్రసాద్ భోజనం సంగతి.

హాల్లోకి రాగానే అడిగింది "నరసమ్మా! వారు భోజనం చేయకుండా వెళ్ళారు. ఇప్పుడెలా?"

"అమ్మా! ఆరి గురించి తమరేం బయపడమాకండి. ఆరు ఎక్కడ్నో ఫ్రెండింట్లో తిని పడుకొంటారు. అదిగో బెడ్ రూము. తమరూ, బాబు అక్కడ పడుకొని హాయిగా నిద్రపొండి" అంటూ సోఫాలో వున్న బాబుని భుజాన పడుకోబెట్టుకొని బెడ్ రూము తలుపులు తెరిచింది నరసమ్మ.

అది డబుల్ కాట్ బెడ్. బాబునందులోని బెడ్ మీద పడుకోబెట్టింది శ్రీలత.

"అమ్మ గోరూ! తమరు ఏ ఆలోచనా లేకుండా పడుకోండి. ఏదైనా అవసరముంటే తలుపు తట్టండి. నేను హాల్లోనే పడుకొని వుంటా. తలుపు దగ్గరకు వేసుకోండి" జాగ్రత్తలు చెప్పి బయటకు వచ్చేసింది నరసమ్మ.

శ్రీలత మెత్తని పరుపుమీద బాబు పక్కన పడుకొని ఆలోచిస్తోంది. తను చేసింది ఎంత వరకు సమంజసం? ముక్కు ముఖం తెలియని వాడి ఇంటికి వచ్చేయడమేనా? ఊరికి దూరంగా గెస్ట్‌హౌస్‌లో పడుకోవడమా? అయినా అతను అలా రమ్మనడం ఏంటి? తను మత్తుమందు చల్లినట్లు వెనకబడి రావడమేంటి? నేడు సమాజంలో జరిగే ఘోరాలు వింటూనే తను ఇలా ఇతరుల ఇంట్లో పడుకోవడమా ?

చాలాసేపు ఆలోచించింది శ్రీలత. ఏది ఏమయినా రాత్రంతా తాను నిదురపోకుండా జాగ్రత్తగా మేలుకొనే వుండాలి అనుకొంది.

• • •   • • •   • • •

చిన్నగా తలుపు చప్పుడయ్యేసరికి ఉలిక్కిపడి లేచింది. ఛ.... నిద్ర పోకూడదను కుంటూనే తను గాఢమైన నిద్రపోయింది. తనను తాను లో లోపలే తిట్టుకొంటూ మంచం దిగింది.

"ఎవరూ?" అంది శ్రీలత.

"నేనమ్మా. నరసమ్మను" ఆమె గొంతు వినేసరికి తన పిచ్చి ఆలోచనకు నవ్వుకొని తలుపు తీసింది. లోపలకు దూసుకొని వచ్చిన ఆ వ్యక్తి చప్పున తలుపుమూసాడు.

"మీరు ... మీరు..." అంది శ్రీలత భయంతో మాట తడబడుతుండగా.

" అవును నేను నేనే..." అన్నాడు కృష్ణ ప్రసాద్.

తన ఆలోచనలు నిజమయ్యేసరికి శ్రీలతకు ఒళ్ళంత చెమట పట్టింది.

తలుపు తీద్దామంటే తలుపుకు ఆనుకొని నిలబడి వున్నాడు కృష్ణప్రసాద్.

"ఇదుగో శ్రీలతా! నరసమ్మ సంగతి పూర్తిగా మరిచిపో. అది వరండాలోకి వెళ్ళిపోయింది. ఇక నీ గావుకేకలు ఈ గది దాటి బయటకు పోవు. బయట ఉరుములు, మెరుపులతో హోరున వర్షం. ఇక్కడ డైనమేట్ పేల్చినా పక్క ఇంటికి వినిపించదు. అరుపులు మాని కబుర్లు చెప్పు" అన్నాడు వాకిటి దగ్గరకు కుర్చీ లాక్కొని కుర్చొంటూ.

సింహం వాతపడ్డ లేడిలా అయింది శ్రీలత పరిస్థితి. పెద్దమనిషని ఎంతో నమ్మకంతో వస్తే చివరికి ఇదా జరిగిన పని. బాబు ఒకవైపు గాఢమైన నిద్ర పోతున్నాడు. ఈ విషమ పరిస్థితి నుండి బయటపడడమెలా అని ఆలోచిస్తోంది.

ఆమె ఊహించని విధంగా కృష్ణ ప్రసాద్ చప్పున లేచి వచ్చి ఆమెను తన సందిట్లో బిగించాడు. శ్రీలతకు ఊపిరి ఆడలేదు. అతని ఉక్కు కౌగిట్లో నుంచి బయటపడడానికి ఆమె శక్తి చాలడంలేదు.

" శ్రీలతా అచ్చం నువ్వు శోభనం రాత్రి నా గదిలోకి అడుగుపెట్టిన నా భార్య అన్నపూర్ణలా వున్నావ్. అన్నపూర్ణ ఆ రాత్రి ఇలాగే నా కౌగిలిలో చేరి నన్ను అమరలోకాలకు తీసుకుపోయింది. పాపం నువ్వూ కాదనవులే. చలిబాధ ఇద్దరికీ వుందిగా" అంటూ ఆమె పెదవులను తన పెదవులతో బంధించాడు.

శ్రీలత అతి కష్టంమీద తన శక్తినంతా కూడదీసుకుని కృష్ణప్రసాద్‌ను దూరంగా నెట్టింది.

"ఛ.... మీరేదో పెద్దమనుషులని అనుకొన్నాను. మిమ్మల్ని నమ్మి ఇక్కడికి వచ్చినందుకు తగిన శాస్తి చేశారు. నేనిక్కడింకొక్క క్షణం కూడా వుండను". అంటూ పిల్లవాడి దగ్గరకు పరిగెత్తింది.

మధ్యలోనే పట్టుకొన్నాడు.

"ఎక్కడికి వెళ్తావ్. ఈ వర్షంలో, ఈ చలిలో? అయినా నిన్ను ఇక్కడికి తెచ్చింది నిన్నూరికే వదలడానికి అనుకొన్నవా? నీకోసం కాచుకొని వున్న రాబందుల బారిన పడకుండా నిన్ను జాగ్రత్తగా తీసుకొచ్చినందుకు కృతజ్ఞత కూడా లేకుండా ప్రవర్తిస్తావా..." పెద్దగా నవ్వాడు కృష్ణప్రసాద్.

శ్రీలత గింజుకుంటూ..."ఏదండీ కృతజ్ఞత. మీరు చేసిన సహాయానికి చెయ్యెత్తి నమస్కరిస్తాను. నా శక్తి కొలదీ వున్న డబ్బు ఇవ్వగలను. అంతేగానీ........"

"అంతేగానీ ఒక్కరాత్రి నా దగ్గర గడపనంటావ్" ఆ వాక్యాన్ని వత్తిపలుకుతూ అన్నాడు.

శ్రీలతకు అసహ్యంగా వుంది అతని సంభాషణ.

"ఛీ నువ్వు మనిషి కాదు పశువ్వి" అంది చివరకు.

"అయితే నాకోరిక తీర్చనంటావ్"

"తీర్చను" అంది శ్రీలత.

"తీర్చకపోతే బలవంతంగా తీర్చుకుంటాను" కోపంగా అన్నాడు కృష్ణప్రసాద్.

"సార్. ఇది మీకు న్యాయం కాదు. పవిత్రంగా బతుకుతున్న నన్ను నాశనం చేయకండి" విధిలేక ఏడుస్తూ అతని కాళ్ళమీద పడింది.

కృష్ణప్రసాద్‌లో కొంత మార్పు కనిపించింది. ఆమెను లేవదీసి "సారీ శ్రీలతా! నా భార్య దుస్తులు ధరించేసరికి నీలో నా అన్నపూర్ణ కనపించింది."

"అయితే మీ భార్య దుస్తులు ఇచ్చేస్తే వెళ్ళిపోతారా"

"తప్పకుండా" అన్నాడు కృష్ణ ప్రసాద్ నమ్మకంగా.

రెండడుగులు ముందుకు వేసి, "అడ్డు తొలగండి" అంది గుమ్మం దగ్గరకు వచ్చి.

"ఎక్కడికి?" అన్నాడు

"హాల్లో నా సూటుకేసు వుంది. అందులో నా బట్టలున్నాయి" అంది శ్రీలత.

"నో! నువ్వు ఇక్కడి నుంచి కదలడానికి వీల్లేదు. నా భార్య చీర, జాకెట్టు విప్పి ఇచ్చేయ్! వెళ్ళిపోతాను"

శ్రీలతకు క్షణం క్షణం నరకంగా వుంది. చుట్టూ గోడకాని, బీరువా కానీ, బట్టలు స్టాండుకాని లేదు చాటున నిలబడి బట్టలు విప్పడానికి అనుకొంది.

రెండు నిమిషాలు తరువాత ఒక్కొక్క అడుగు ముందుకు వేసుకుంటూ వస్తున్నాడు కృష్ణప్రసాద్. ఇక లాభం లేదనుకొంది శ్రీలత కుచ్చిళ్ళు లాగి చీర విప్పి కృష్ణప్రసాద్ కాళ్ళముందు గిరవాటేసింది. చేతులు వెనక్కు పెట్టుకుని హుక్స్ లాగి జాకెట్ విసిరి కొట్టింది.

"మీవి మికిచ్చేశాను. ఇక వెళ్ళండి" అంది బిగ్గరగా.

కృష్ణప్రసాద్ ఆమెను పై నుంచి కిందకి ఒకసారి పరిశీలనగా చూసి... "ఆహా! ఏమి అందం? ఏమి సొగసు? వీనస్ విగ్రహం శ్రీలతా నువ్వు. నీ విశాలమైన కళ్ళు చూడు నన్నెలా ఆహ్వానిస్తున్నాయో. నీ నున్నని బుగ్గలు, నోరూరించే నీ ఎర్రని పెదవులు, ఆ పొడవైన నల్లని జడ, అందులోని తెల్లని మల్లెపూలు నీకిష్టం లేకున్నా ఆహ్వానిస్తున్నాయి. నీ నున్నని, తెల్లని భుజాలు, సన్నని నడుము అయ్యో అన్నపూర్ణా! మళ్ళీ ఈ రూపంలో వచ్చావా! నాకు ఈ రోజు విందు చేయబోతున్నావా!" ట్రాన్స్‌లో వున్నట్లు మాట్లాడుతున్నాడు కృష్ణప్రసాద్.

"ఏమండీ ! ఇది న్యాయం కాదు. మీరడిగినవన్నీ ఇచ్చాను. ఇక దయచేసి వెళ్ళిపొండి" అంది శ్రీలత రెండు చేతులు జోడించి బిగ్గరగా ఏడుస్తూ.

ఈ లోకంలోకి వచ్చాడు కృష్ణప్రసాద్. అతని గొంతు ఓ రకంగా మారిపోయింది.

"అన్నీ ఎక్కడ ఇచ్చావే" అన్నాడు ఆమె బ్రా, లంగావైపు చూస్తూ.

"నో అవి నేనివ్వను" మొండిగా అంది శ్రీలత.

"ఎందుకివ్వవే" అంటూ సింహంలా ముందుకు దూకాడు కృష్ణప్రసాద్. భయంతో 'కెవ్వు'...మని అరిచింది శ్రీలత.

• • • • • • • • •

బయట దబదబమనే చప్పుడుతోపాటు "అమ్మగారూ... అమ్మగారూ" అంటూ కేకలు వినబడేసరికి ఉలిక్కిపడి లేచింది శ్రీలత.

వేసిన తలుపులు వేసినట్టే వున్నాయి. తన శరీరం నిండా బట్టలు వున్నాయి. బాబు ప్రశాంతంగా నిద్రపోతున్నాడు. అయితే ఇదంతా కల అన్నమాట. 'భగవాన్ రక్షించావ్' అనుకుంటూ లేచి నిలబడింది. గోడమీద గడియారం ఆరుగంటలు చూపిస్తోంది.

'అయితే తెల్లవారిందన్నమాట' అనుకొంటూ తలుపులు తీసింది. ఎదురుగా నరసమ్మ.

"ఏంది అమ్మాయిగోరూ! అట్టా కేకలేసిన్రు." అడిగింది భయం భయంగా.

"ఏదో పీడకల వచ్చింది నరసమ్మా"

"అలాగా అమ్మా! అంత భయంగా వుంటే నన్ను కూడా పిలిస్తే ఇక్కడే పడుకొనేదాన్ని కదా" అని బాధపడ్డ నరసమ్మ. "అయ్యగోరు ఇంకో గంటలో ఇక్కడికి వచ్చేస్తారు. వర్షం కూడా పూర్తిగా తగ్గిపోయింది. మీరు స్నానం చేసి రెడీగా వుంటే అయ్యగోరు మిమ్మల్ని బస్సెక్కిస్తారు" అంది.

బాత్‌రూంలో వేణ్నీళ్ళు ఎప్పుడో రెడీ చేసింది నరసమ్మ. ముందు బాబుకు స్నానం చేయించి వాడికి బట్టలు తొడిగి సిద్ధం చేసి, తనూ స్నానం చేసి తనూ సూట్‌కేసులోని బట్టలు ధరించింది.

ఇంతలో ఫ్రెష్‌గా తయారయి వచ్చాడు కృష్ణప్రసాద్. నవ్వుతూ ఆడుకొంటున్న బాబును ఎత్తుకొని ముద్దు పెట్టుకున్నాడు.

"అమ్మా! బాగా నిద్రపట్టిందా" ఎంతో మృదువుగా అడిగాడు శ్రీలతను.

శ్రీలత మౌనంగా తలాడించింది. ఇంత మంచి మనిషి గురించి తనంత క్రూరంగా ఆలోచించినందుకు మనసులో ఎంతో సిగ్గుపడుతోంది.

ఇంతలో డైనింగ్ టేబుల్ మీద టిఫిన్ ప్లేట్లు సర్ది పిలిచింది నరసమ్మ.

శ్రీలత, కెదురుగా కూర్చున్నాడు కృష్ణప్రసాద్. బాబును ఒళ్ళో కూర్చోబెట్టుకుని టిఫిన్ చేస్తున్నాడు.

"అమ్మా ముక్కు ముఖం తెలియని నేను నిన్ను ఇలా ఎందుకు తీసుకొచ్చానని నీకు చాలా ఆశ్చర్యంగా వుంది కదూ"

"ఆశ్చర్యమే కాదు అనుమానం కూడా కలిగింది" ప్లెయిన్‌గా మాట్లాడింది శ్రీలత, ఉప్పుకప్పురంబు నొక్కపోలికనుండు అన్న భావనతో.

కృష్ణప్రసాద్ చిన్నగా నవ్వి... "అమ్మా! నా జీవితంలో జరిగిన ఓ అత్యంత విషాదకరమైన సంఘటన విని నన్నేమనుకుంటావో చెప్పు" అంటూ చెప్పడం మొదలు పెట్టాడు.

"నా భార్య ఒకసారి తన తల్లిదండ్రులను చూడ్డానికి వాళ్ళూరికి వెళ్ళి తిరిగి రైల్లో వస్తూ మధ్యలో తుఫానులో చిక్కుకుంది. ఆ సమయంలో అదే రైల్లో వుంటే తమ ప్రాణాలు దక్కవని రైలు దిగి దగ్గరలో వున్న ఓ ఊరిలోకి బయలు దేరారు ప్యాసెంజర్లు.

ఆ సమయంలో కొందరు దుర్మార్గులు నా భార్యను అతి దారుణంగా చంపి నగలు దోచుకుపోయారు. ఆ నాటి నుండి నేను ప్రయాణం మధ్యలో చిక్కుకున్న నా దృష్టిలో పడ్డ

ఆడవారిని ఇలా రక్షిస్తున్నాను. ఇది నాభార్య ఆత్మకుశాంతి నిస్తుందని నా పూర్తి నమ్మకం." కృష్ణప్రసాద్ కళ్ళల్లో నుంచి నీరు ధారాపాతంగా కారుతున్నాయి. అతను వాటిని తుడుచుకునే ప్రయత్నంకూడా చేయలేదు. కాఫీ తెచ్చి తిరిగి వెళుతున్న పనిమనిషి నరసమ్మ తన పైట చెంగుతో కళ్ళొత్తుకుంటూ వెళ్ళిపోయింది.

"సారీ సార్! మీ గుండెలో ఇంత విషాదగాథ వుందని నేను ఊహించలేదు" పశ్చాత్తాపంగా అంది శ్రీలత.

టిఫిన్ చేసిన తరువాత అంతా హాల్లోకి వచ్చారు. బయలుదేరబోయేముందు అన్నపూర్ణ ఫోటోకెదురుగా నిలబడి రెండు చేతులెత్తి భక్తితో నమస్కరించింది శ్రీలత ✸

**(స్వాతి వీక్లీ, తేది 14-10-94)**